apmas

AEIN
Aide à l'Enfance de l'Inde et du Népal

# పాడి పశువులలో పొదుగు వాపు (MASTITIS)

పొదుగు వాపు వ్యాధి ప్రపంచవ్యాప్తంగా పశుపోషకులను, పశువైద్యులను తీవ్రంగా కలవర పరుస్తూ సవాలు విసురుతున్నది.పాడి రైతులకు ఈ వ్యాధి మొదటి శత్రువు. వ్యాధి సోకిన పొదుగు భౌతిక రసాయనిక మార్పులకు గురిచెంది పాల దిగుబడి, పాల నాణ్యత కోల్పోయి పాలు వినియోగానికి పనికిరావు. అధిక వ్యయ ప్రయాసలకోర్చి వైద్య మందించినా పొదుగు తాత్కాలికంగా లేదా శాశ్వతంగా పనికి రాకుండా పోతుంది.రైతులు అధిక నష్టాలకు లోనవుతారు.

## పొదుగు వాపు కారణాలు

1. సూక్ష్మ క్రిములు
2. మనిషి
3. పశువు
4. పరిసరములు

## పొదుగు వ్యాధి వ్యాపించు విధానము:

1. రోగ క్రిములు వ్యాధి సోకిన పొదుగు నుండి ఇంకొక పశువుకు ఈగల ద్వారా, పాలు పితికే వారి మురికి చేతుల ద్వారా, కలుషితమైన పరిసరాల ద్వారా, పాలు పితికే యంత్రముల ద్వారా వ్యాపిస్థాయి.
2. పొదుగునకు గాయమైనపుడు దూడలపల్లు, పితికే వారి గోల్ల ద్వారా గాయాలయినపుడు సూక్ష్మక్రిములు పొదుగును చేరి వ్యాధిని కలిగిస్తాయి.
3. పాలు పూర్తిగా తీయక పోయినా రావచ్చును.
4. పాలు పితికిన తర్వాత పొదుగు శుభ్రము చేయక పోవడం వలన.

## పొదుగు వాపులో ఎన్ని రకాలు:

- అతి తీవ్ర స్వరూపపు పొదుగు వాపు (పర్ అక్యూట్ మాస్టయిటిస్)
- తీవ్ర స్వరూపపు పొదుగు వాపు (అక్యూట్ మాస్టయిటిస్)
- సాధారణ పొదుగు వాపు (సబ్ అక్యూట్ మాస్టయిటిస్)
- దీర్ఘ కాలిక పొదుగు వాపు (క్రానిక్ మాస్టయిటిస్)
- జబ్బు లక్షణాలు లేని పొదుగు వాపు (సబ్ క్లినికల్ మాస్టయిటిస్)
- రక్తము సరఫరాలేక పాసిపోయే పొదుగు వాపు (గాంగ్రీన్ మాస్టయిటిస్)
- శిలీంద్రము వలన పొదుగు వాపు (ఫంగల్ మాస్టయిటిస్)
- రక్త మిశ్రితమైన పొదుగు వాపు(హీమో గ్యాలెక్టియా).

## లక్షణాలు:

పొదుగు అన్ని చన్నులు లేదా కొన్ని వాచి వేడిగా నొప్పిగా వుంటాయి. వ్యాధి సోకిన పొదుగు గట్టిగా వుంటుంది. పాలలో రక్తము లేదా చీము చేరి పాలు దుర్వాసన కలిగి వుంటాయి. పాలలో కుదపలు వుంటాయి. పాలు తీసినపుడు పాలు కాకుండా నీళ్ల వంటి పదార్థము లేదా పాలు గట్టిపడి తీగలుగా జిగటగా వస్తాయి. పశువు జ్వరము వచ్చి నీరసంగా వుంటుంది. నీళ్ళు త్రాగదు. మేత మేయదు. పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. పాల నాణ్యత లోపిస్తుంది. పాల రుచి మారుతుంది. వ్యాధి తీవ్రతను బట్టి కొన్ని సందర్భాలలో ఒకటి లేక అన్ని చన్నులు గట్టి పడి (ఫైబ్రోసిస్) పోతాయి. పొదుగు పూర్తిగా ఉపయోగము లేకుండా పోతుంది.

## పొదుగు వాపు గుర్తించే విధానములు, రోగ లక్షణములు మరియు చిహ్నములు:

నల్లని గుడ్డపై పాలు పితికి చూడాలి. గుడ్డ పై చీము,రక్తము, కుదపలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయడం ప్రారంభించాలి.

పాలల్లో ఉదజన సూచి ( పి. హెచ్.) 7.4 కన్న ఎక్కువ వుంటే వెంటనే పాలనుపరీక్షించాలి. ఇప్పుడు మార్కెట్ లో అందుబాటులో వున్న "మాస్ టెక్ట్"లేదా "మాస్ట్రిప్" పేపరును ఉపయోగించి పరీక్షించ వచ్చును. కాలిఫోర్నియా మాస్టయిటిస్ టెస్ట్ (సి.ఎం.టి) ద్వారా పరీక్షించ వచ్చును. పొదుగులో కానీ పాలల్లో కానీ ఏ కొద్దిగా మార్పు వచ్చినా వెంటనే పశు వైద్యులను సంప్రదించాలి. చికిత్స సకాలంలో అందించక పోయినా స్వంత వైద్యము చేసినా వ్యాధి నయంకాక పోవచ్చు,అధిక వ్యయముతో బాటు చికిత్స చాలా ఆలస్య మవుతుంది.





## చికిత్సా విధానము:

- పొదుగు వాపు తీవ్రతనను అసరించి వైద్యమందించాలి. పశు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించాలి.
- వ్యాధి సోకిన పశువును మంద నుండి వేరు చేయాలి.
- ఆరోగ్యమైన పశువుల నుండి మొదట పాలు పితికిన తర్వాత వ్యాధి సోకిన పశువు పాలు తీయాలి. వ్యాధి సోకిన పశువు పాలను పారబోయాలి.
- వ్యాధి తీవ్రతననుసరించి పెన్సిలిన్, టెట్రా సైక్లిన్, నియోమైసిన్, స్ట్రెప్టోమైసిన్, అంపిసిల్లిన్, కార్టిజోన్, ఆంటీ హిస్టమిన్ మరియు అనల్జేసిక్ తదితర మందులు పశువైద్యుల పర్యవేక్షణలో వాడాలి.
- పొదుగుపై పూతకు మాస్టిసిన్, మాస్టిలెప్, ఐడెక్స్ లేదా ఇతర మలాములు వైద్యుల సలహామేరకు వాడాలి.
- పొదుగు లోపలికి చన్నుల ద్వారా మామ్మిటాల్, పెండిస్ట్రిన్, టైలాక్స్ లేక ఇప్పుడు కొత్తగా మార్కెట్ లో అందుబాటులో వున్న మందులను ఎక్కించాలి.
- పొదుగు వాపు పూర్తిగా నయమయ్యే వరకు మందులు వాడాలి. మందులు వాడినా ఫలితం లేకపోతే వెంటనే పాలను ప్రయోగశాలకు పంపి వారు సూచించిన మందులు సరైన మోతాదులో జబ్బు నయమయేంత వరకు వాడాలి.

## పొదుగు వాపులకు వాడుకలో వున్న కొన్ని నాటు చికిత్సలు:

- నొప్పి తగ్గటానికి కలబంద(aloe vera) 2 పట్టలు, సున్నము 25 గ్రాములు,పసుపు 25 గ్రాములు ,నిమ్మ రసము 20 మిల్లీ లీటర్లు కలిపి రుబ్బి గంటకు ఒక మారు పొదుగుకు పూయాలి.
- కొందరు అసెటిక్ ఆసిడ్ లేక నిమ్మరసం చాక్పీసుల పొడి కలిపి పూస్తారు. ఐసు గడ్డలు పలచటి గుడ్డలో వేసి పొదుగుకు రోజుకు వీలైనన్ని మార్లు కట్టాలి.
- హూమియోపతి మందులు సల్ఫర్, కార్బోవెజ్, సిలిషియా, ఆరం మ్యారియాటికం నేట్రోనేటం, కాల్కేరియా ఫ్లోర్, కోనియం మొదలగు మందులు నిపుణులైన వైద్యుల సలహాతో వాడవచ్చును.
- 50 నుండి 60 గ్రాముల వెల్లుల్లి దంచి తినిపించ వచ్చును.
- ప్రతి మూడు నాలుగు రోజుల కొకసారి అర కిలో మొలక ఉలవలు ఉడికించి,రుబ్బి పశువులకు తిని పించితే,దానిలోని "సెలీనియం" మరియు " విటమిన్ ఇ " పొదుగు వాపును అరికట్టగలవు. పాల నాణ్యత,దిగుబడి పెరుగుతుంది.

## చికిత్స అందించినా పొదుగు వాపు నయము కాక పోవడానికి కారణాలు

చికిత్స ఆలస్యంగా మొదలు పెట్టడము. | సరైన మందులు ,సరైన మోతాదులో వాడకపోవడం. | చికిత్స మధ్యలో ఆపివేయడం లేదాప్రతి రోజు చికిత్స అందించక పోవడము.

## పొదుగు వాపు నివారణకు తీసుకోవలసిన చర్యలు:

1. పొదుగును, చన్నులను గోరు వెచ్చటి నీటితో రుద్దుతూ కడుగవలెను.
2. పొదుగులోని పాలను వేగంగా, పూర్తిగా పితకాలి. కొన్ని పాలను పొదుగులో వదిలేస్తే వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ ఉంటాయి.
3. పాలు పితికిన వెంటనే పశువును పడుకోకుండా మేత దాణా అందించాలి. పశువు 20 నుండి 30 నిమిషాలు నిలబడితే చన్ను రంధ్రము మూసుకు పోయి వ్యాధి సోకే అవకాశాలు వుండవు.
4. పాలు పితికిన తర్వాత దూడను పాలు త్రాగటానికి వదిలితే దూడ నోటిలోని చొంగ వలన చన్ను రంధ్రము మూసుకుపోతుంది.
5. పాలు పితికిన తర్వాత మార్కెట్ లో అందుబాటులో వున్న మందులలో అన్ని చన్నులను ముంచాలి లేదా స్ప్రే చేయాలి.
6. పశువుల కొట్టాలలో మల మూత్రాలు, తేమ, బురద, దుమ్ము వుండరాదు.
7. ఉదయం, సాయంకాలం క్రిమిసంహారక మందులతో కొట్టాలని శుభ్రము చేయాలి.
8. బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలమూత్రాలు, ఇతర చెత్తను పశువుల కొట్టాలకు దూరంగా వేయాలి .
9. పాలు పితికే రైతు గోళ్ళు లేకుండా చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి.
10. కొత్తగా మందలోకి చేరు పశువులను బాగా పరీక్షించిన తర్వాత అనుమతించాలి.
11. నాలుగు నెలల కొకమారు పొదుగు మీద వెంట్రుకలు తొలగించాలి.
12. పొదుగుకు, చన్నులకు గాయాలు వుంటే వెంటనే చికిత్స చేయాలి.
13. పాలు తీయుట నిలిపివేసి వట్టిపోయిన వెంటనే ఒకసారి, ఈనుటకు ఒక వారము ముందు మరొక సారి యేంటీ బయోటిక్ మందును అన్ని చన్నులలోకి ఎక్కించాలి .
14. అధిక పాల దిగుబడి ఇచ్చే సంకర జాతి పశువులు, ముర్రా గేదలలో, మొదటి ఈత కంటే, తర్వాత ఈతల్లో ఈనిన ప్రారంభ దశలో, చివరి దశలో పొదుగు వాపు వచ్చే అవకాశాలు ఎక్కువ, కాబట్టి రైతులు అప్రమత్తంగా వుండాలి.
15. సకాలములో సరైన సత్వర చికిత్స చేయడం, పరి శుభ్రముగా వున్న ప్రదేశంలో పాలు తీయడం, సక్రమ మైన యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు పొదుగు వాపు మహమ్మారి నుండి బయటపడవచ్చు.

**మహిళా అభివృద్ధి సొసైటీ, ప్రధాన కార్యాలయం**
ఫ్లాట్ నెంబర్: 11&12, తానేషనగర్, మణికొండ
హైదరాబాద్ – 500089
ఫోన్: 081434031 18/19/20

**కురబలకోట ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
అంగళ్ళు, అంగళ్ళు పోస్ట్, కురబలకోట మండలం
చిత్తూరు జిల్లా – 517350 | ఫోన్: 9666 259071

**వాల్మీకిపురం ఫార్మర్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
పాత సొసైటీ బిల్డింగ్, బైపాస్ రోడ్డు
వాల్మీకిపురం మండలం, చిత్తూరు జిల్లా – 517299
ఫోన్: 9666 259071